కథానిక

# సత్తెమ్మ తల్లి

"రమణశ్రీ"

సింహాద్రి "అంకమ్మ శివాలు" ఆవేశించినట్లు వడవడ తూగిపోతున్నాడు. రక్తజ్వాలల్లాగ నేత్రాలు ఉజ్జ్వలించి పోతున్నయ్. అతనినోరు కట్టుతెగి పొరలి పారుతోంది.

"చంపుతా, పొడుత్తా, నరుకుతా" అన్న మాటలు తప్ప మరొక మాటలు నోటివెంట రావటంలేదు.

రచ్చచావడిమీద "గూఢ పురాణి" తీర్చి కూర్చున్న మునసబు, ఊరి పెద్ద కాపులు, రాజులు నాయుడు, మరో కాయన, సింహాద్రి సింహ విజృంభణ చూచి తూగిపోయారు. మునసబు వెనక్కి వెనక్కి లేస్తూ ఇంట్లో దూరబోయేడు. పెద్ద కాపుల నోట్లో చుట్టలు జారిపోయాయి. పొన్నుకర్రలు తిన్నగా నిలిచేయ్.

సింహాద్రి సింహాకృతి దాల్చాడు.

"పొలంగట్టు ఖాతరా సేస్తే నాకు బలం లేదురా. ముగ్గురూ ఆటాడిత్తారా? సింవ్వాది రప్పన్న సేవ తెలుసుకో. మునసబు ఓరే! వెనకడుగేత్తున్నావురా. పోటు పొడిచేత్తా. ఆగు."

మునసబు దడదడలాడేడు. సింహాద్రి చేతులో వంక కత్తి తళతళ లాడింది.

ముగ్గురు పెద్దకాపులు కర్రలు రక్షగా పిల్లుల్లా నడిచేరు. సింహాద్రిని మూడు కర్రలతో బిగిసిపట్టి పడగొట్టేరు. తాగి వున్నాడేమో, వళ్లు తెలియక నేలమీద రాలిపోయేడు. ముగ్గురూ చేతిలో వంకకత్తి లాగేసేరు. చేతిలో వంక కత్తి లాగేయడంతోనే మునసబు పరుగెత్తు కొచ్చాడు. సింహాద్రిని పట్టుకు తన్నేడు. చతుష్టయం తమ కాలి చెప్పులతో కసితీరా కొట్టారు. సింహాద్రి స్పృహతప్పి పడిపోయేడు. ముగ్గురు కాపులూ విజయగర్వంతో గర్జించేరు. మునసబు హుంకరించాడు. సింహాద్రి చిందర వందరగా పడిపోయేడు, కాయం గాయాలతో రక్తరేఖలతో ఎర్రగా మెరుస్తున్నది.

* * *

లోగడ మందడిగట్టు గురించి, సింహాద్రికీ రాజులు నాయుడికీ తగువొచ్చింది. రాజులు నాయుడు చేను ప్రక్కనే నాలుగెకరాల చేను సింహాద్రి కుంది. నాయుడు, గట్టు తనదేనని, గట్టుమీద సింహాద్రి వేసుకొన్న కందిచేను ఒక రాత్రి రాత్రే కొట్టేసుకున్నాడు.

సింహాద్రి ప్రొద్దుటలేచిచూచేటప్పటికి బోడి గట్టు సిద్ధమైవుంది. రాజులు నాయుడు మీద కలబడ్డాడు. రాజులు నాయుడు మునసబు సహాయం తీసుకొచ్చాడు. ఇరవై అయిదెకరాల మాగాణి చేను సుదీర్ఘంగా కనుచూపు మేరకు అనుతోనేవుంది. మునసబు నాయుడు వెనకనక్కి "అవునోయ్ సింహాద్రీ! దౌర్జన్యంగా పెద్ద కాపుమీద కలబడ్డం నీదే తప్పు! చూడు నీకు మాత్రం తెలీదూ? ఇరవై అయిదెకరాలు గట్టు కూడా ఆయనది కాక నీదవుతుందేటి?"

గట్టుమీద తాడిచెట్లు హోరుమని ఆవలించేయి. సింహాద్రి కడుపులో బడబానలం మంటలెత్తింది.

"బలేగుందిలేవయ్యా! తీరుపు. ముందవతలికి నడు. మక్కెలిరుగుతై" అనే ఫక్కీలో మాట్లాడాడు.

మునసబు మనసు మొగ్గలేసింది. సింహాద్రి శౌర్యంచూచి గుండెలు డక్కుడక్కు మన్నై. మోతుబరి పెద్దకాపు గాబట్టి అతనివైపు మాట్లాడక తప్పిందికాదు!

గట్టు నాదని రాజులునాయుడు సింహాద్రి మీద దావావేశేడు. ధనికవాద పక్షంగా 'కోర్టు' విజయ దుందుభులు మ్రోగించింది. 'గట్టు'అతనిస్వాధీనంలోనేవుండాలనీ, గట్టుకు మట్టి తోలించింది అతనేననీ ఇతరులకు ఏ విధమైన హక్కు లేదనీ, రాజులు నాయుడువైపు

తీర్పు చెప్పించింది. కాని సింహాద్రి, తాతలతరం నుంచీ, వాళ్ళఅధీనంలో నేవుండి, అన్ని విధాలా ఉపయోగించేది.

ఈ అక్రమం కారణంగా సింహాద్రి సింహాకృతితో తెగబ్రాగి, 'అంకమ్మ శివాలు' తొక్కుతూ, మునసబునీ రాజులునాయుణ్ణీ తుదముట్టించ దలచుకొన్నాడు. కాని చిత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. పెద్దకాపులు నైచ్యంగా హింసించి వదిలిపెట్టేరు. అతన్ని చూచి ఎవరూ జాలిపడ లేకపొయ్యారు.

* * *

ఇంత మెత్తగా చావదన్ని మునసబూ, నాయుడూ సింహాద్రిమీద రిపోర్టు ఇచ్చారు. పోలీసులు పట్టణంనుంచి వచ్చేటప్పటికి ఇంట్లో లేడు సింహాద్రి. ఏవూరో ఉడాయించాడు!

సింహాద్రి భార్య 'వీరి' గోలపెట్టింది. పోలీసులు జరిగినదంతా విన్నారు.

"ఎక్కడికెళ్ళాడు?"

"ఏమో తెలీదు బాబూ! నిన్నట్ణుంచి కూటికే రాలేదు బాబూ."

పోలీసులేవో రాసుకుని వెళ్ళిపోయారు.

* * *

"ఒసేవ్! చిన్నీ! ఇట్లా రావే?"

చిన్ని రాజులునాయుడి చిన్న కూతురు. పదకొండు పన్నెండేళ్లు. చెవులకు ముక్కులకి పోగులతో ముద్దుగా వుంటుంది. చిన్ని చెంగున దూకుకుంటూ పరుగెత్తుకొచ్చింది.

"ఏమమ్మా! ఎందుకు పిలిసేవ్."

"ఇంట్లో కాసింత పచ్చడన్నా లేదే! సింత సిగురు గిల్లుకురావే మాన్నెంలోకెల్లి."

"ఓ! ఇట్టే ఎల్తానే."

"పురుగూ పుట్రా జాగరత."

"భల్లేదులే."

గంపనెత్తినెత్తుకొని ఏరుపిడక లేరుకుంటూ బయల్దేరి పోయింది. సాలోపు గట్లనిండా నిర్లక్ష్యంగా అల్లుకొన్న ముళ్లపొదల్లు, నానాజాతి అడవితీగెలు. ఈత చెట్లు కంతాలదగ్గర గాట్లతో వికృతంగా విర్రవీగుతున్నై. ఒక చెట్టుకి ఒక తలకాయ నరికేస్తే మరో తల పుట్టివుంది.

తాటిచెట్ల మధ్యనుంచి నడచిపోతోంది 'చిన్ని.' గాలి సన్నసన్నగా ఈలలువేస్తోంది. గొర్రెల మర్రాలమ్మ కొడుకు గొడ్లు కాసుకుంటూ నాగస్వరం ఊదుతున్నాడు. పాడునైన ఊలకర్ర. అది మురళి ఊదుతుంది. నాగస్వరం వాయిస్తూంది.

"ఏవేఁచిన్నీ. ఏడకీ, మాన్నెంలోకేటే' అంటూ, గర్రుమని వేళాకోళానికి రాయివేసి పకాలుమన్నాడు.

"అఫ్రా గొల్లిగా"- చెంగుమని దూకింది. పకపక నవ్వుకుంటూ పరుగులు వారింది చిన్న సేలయేటి కెరటంలాగ.

చిన్ని పొన్నమావి గున్నలాగ నడిచిపోతోంది. దారిలో లచ్చిందేవి కూతురూ, కొందరు పిల్లలూ కన్పించేరు.

"ఒసేవ్! సింత సిగురుకేనా? ఇంత జాగరం చేసేవేమే? పురుగూ పుట్రా సూసుకెళ్లు."

"నాకు తెలుసులే మీరు సెప్ప నక్కర లేదు" ఆ పిల్లలు ఒళ్లనిండా చక్కని చింత చిగురుతో భిలబిలలాడుతూ పోయారు. దారిలో దొరికే పిడక లేరుకుంటూ ముందుకు సాగిపోయింది చిన్ని. 'మాన్యం'లో కొచ్చింది. చింతచెట్లు చిగురు యెక్కువగా లేదు. కచ్చాబిగించి ఝణకమంటూ చెట్టెక్కింది. అందినంత వరకు చిగురుకోసింది. క్రిందికి దిగి వడిలో చూస్తే యెంతో లేదు.

దూరంగా వెళితే అదో అనటి దూరంలో ఆవలి పంపులో పెద్ద చెట్టు వసంత శోభ లొలుకబోసుకుంటూ, వయ్యారంగా ఆహ్వానిస్తోంది. చంగున గంప నెత్తుకొని అవతల పంపులోకి పరుగువారింది. చెట్టు దగ్గరికి చేరింది. గుండెలు పిటపిటలాడేయి. నిశ్శబ్దం. బిగదీసుకొని చిన్ని చెట్టెక్కింది. జారిపోతున్న ధైర్యంతో చివురు గిల్లుతోంది. చెట్టెక్కికోస్తూంటే, ఆమెమనసులో యెన్నో భావాలు ఆలోచనలు పొంగుకొస్తున్నై. తెలియరాని భయం ఆమెలో ప్రవేశించింది, చెట్టు దరికి చేరేటప్పటికి. ఏమి ప్రభావమో?

చెట్టు తీవ్ర భీకరంగా నిశ్వసించింది. ఆ చెట్టుకు కొయ్యకుండా ఉండిన చింతకాయలలాగేవుండి యెండిపోయినై. కొమ్మ రెమ్మలు గాలి కెరటాలకి కొట్టుమిట్టాడినై. ఒడినిండా

చిగురు కోసుకుని చెట్టు దిగింది. చుట్టూ తిరిగింది. "అమ్మయ్యోయ్!"

ఇది 'అమ్మోరి' చెట్టు! చెట్టుక్రింది కొమ్మలకు కోడిపిట్టల తలకాయలు వ్రేలాడుతున్నై.

నేల రాలిపోయిన కోడి యీకల గుంపులు గాలికి ఊగుతున్నై. 'చిన్ని' వళ్లు వళ్లంతా గగుర్పొడిచింది. చెట్టుమీది బలులు చూడ్డంతోనే గుండెల రక్తం ఉవ్వెత్తుగా ఉబుకుతోంది. నాలిక తడారిపోయింది. 'అమ్మోరి' చెట్టుదగ్గర కెళ్ళనేకూడదు. తను చెట్టెక్కి చింతచివురు కోసింది. ఎంత మహాపరాధం!

చిన్నికి కాళ్లు నడయాడలేదు. హోరుమనే నిశ్శబ్దంతో అగాధంలోంచి వచ్చే మూల్గులు, నిశ్వాసాలు ఆ చిన్ని గుండెను భయావహం చేసేయి. ఆమె శరీరంలో భయం పుట్టింది. భయంలో మృత్యువు ఆవిర్భవిస్తోంది.

అమ్మవారి చెట్టుతొఱ్ఱలోంచి, భయంకర ఘూమశ్వాసం, ఎగపిల్పులు, ఆ చిన్ని హృదయాన్ని భయపెట్టినై. కాళ్ళు ముందుకు సాగలేక సాగలేక త్వరత్వరగా సాగుతున్నై. గంప నెత్తినెత్తుకుంది. వళ్లు తేళ్లు ప్రాకినట్లు వీపుమంటలెత్తినట్లు గగుర్పొడిచింది. ఇంటి త్రోవలో ఇదివరకటి చెట్టుదగ్గరి కొచ్చింది. అమ్మవారి భయంకర స్వరూపం ఆమెముందు తాండవిస్తోంది. భయం వెనకాడుతోనే వుంది. ఆ భయంకరమైన చింతచెట్టు, కోడిపిల్లల బుర్రకాయలు, తొఱ్ఱ- సంజవెలుగులు సాగిపోతున్నయి.

* * *

చిన్నికి మగతగా వుంది. ఆ రాత్రంతా నిద్రలేదు. భయంకర దృశ్యాలు!

నిద్రావేశంలో మూలుగుతోంది. తీవ్రంగా కలవరిస్తోంది. "సత్తెమ్మతల్లి సింతచెట్టు తొఱ్ఱలో అమ్మోరు ... అమ్మో... భయంగా వుందే... బలులే! ... కోడితలలు గిజగిజ ... మొండెం కదుల్తోం ... దమ్మోయ్ ... తొఱ్ఱలో."

తల్లి లేచి, "ఏవేఁ చిన్నీ ఎలాగుందే."

"సింతచెట్టు తొఱ్ఱలో ... అమ్మోరు ... అంకమ్మ శివాలు ..."

తల్లికేం పాలుపోలేదు. ఇరుగు పొరుగులొచ్చి చిన్ని అవస్థ చూచేరు.

"సింతచెట్టు తొఱ్ఱలో అమ్మోరిని సూసి భయపడిందమ్మా"

"అక్కడి కెందుకెళ్ళిందో పిచ్చిపిల్ల."

"తల్లి, అమ్మ సత్తెమ్మ తల్లి బలికోరింది. పిల్ల బలైపోవాల్సిందే."

* * *

పారిపోయిన సింహాద్రి ప్రొద్దుటే దిగాడు. రాజులునాయుడి ఇంట్లో అంతా అయిపోయింది అప్పటికి. చిన్ని అమ్మవారికి బలయిపోయింది.

"ఏడవకూడదు. సంతోషంగా వుండాలి. అమ్మవారు బలికోరి తీసుకున్నారు" అని రాముడు ఊరికి పెద్దవాడు ఇంటిల్లిపాదికీ, నచ్చజెప్పేడు.

ఇంట్లో శోకాలు తగ్గేయి. దైన్యం తొలగలేదు. తరువాత రాజులు నాయుడు చింతచెట్టు "సత్తెమ్మ తల్లి"కి జాతర చేసేడు. కోడిపెట్టల బుర్రలు తోరణాలుకట్టేరు. రాత్రంతా జాగారాలతో, భజనలతో, కాళీ పూజలతో భయంకరంగా గడిచిపోయింది.

చెట్టుమీది కోడిబుర్రలు మానవుని అజ్ఞానానికి పకపక నవ్వేయి. చెట్టు చెట్టంతా రక్తరేఖలు ఎగజిమ్మినై.

* * *

ఊరిలో పెద్దలు కొందరు రాజులునాయుణ్ణి సింహాద్రికి సహకరించమనీ, అతని తాతలనాటినుంచీ వస్తున్న గట్టు అతనికిచ్చేయమనీ కోరారు.

మర్నాడు రాజులు గౌరవంగా సింహాద్రి ఇంటికొచ్చి క్షమాపణ కోరుకున్నాడు. అతని గట్టు అతనికిచ్చేసి, ముదరా డబ్బు ఇచ్చి, తన చేలో రెండు తాళ్లు కొట్టుకోమన్నాడు.

"సత్తెమ్మ తల్లి"కి గుడి కట్టించడానికి చందా వసూలు చేయాలనీ, అందుకు సింహాద్రినే నాయకత్వం వహించమనీ కోరాడు.

సింహాద్రీ, తక్కిన గ్రామమంతా మాన్యంలో చింతచెట్టు ఆవరణలో "సత్తెమ్మ తల్లి" గుడి కట్టేందుకు పూనుకున్నారు. అప్పటినుంచీ, చెట్టు తొఱ్ఱలోంచి, గుడి విగ్రహంలోకి మారింది "సత్తెమ్మ తల్లి."

"చింతచెట్టు"మీది కోడిబుర్రలు మానవుని అజ్ఞానానికి పకపక నవ్వేయి.